క్లుప్తంగా

సుర్దేపల్లి వాసికి నంది అవార్డు



అవార్డు అందజేస్తున్న ఏసీపీ

నేలకొండపల్లి: జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ బంగారు నంది అవార్డును నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామానికి చెందిన దూత రామకోటేశ్వరరావు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన కవి సమ్మేళనంలో ఆయనకు తెలంగాణ అసెంబ్లీ ఏసీపీ తేజావత్ రామదాసు చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, ఘన సన్మానం అందుకున్నారు.

పాండురంగాపురం వాసికి సాహితీ రత్న పురస్కారం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని పాండురంగాపురంకు చెందిన కవి, రచయిత, మందపాటి వీరవెంకటరెడ్డికి భద్రాచలంలో జరిగిన మూడు రాష్ట్రాల స్థాయిలో పుడమి సాహితీ వేదిక ద్వారా సాహితీ రత్న పురస్కారం శనివారం అందుకున్నారు. వెంకటరెడ్డికి సాహితీ రంగంలో అందించిన విశిష్ట సేవలకు పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో పుడమి సాహితి వేధిక అధ్యక్షుడు, సదాశివరెడ్డి, దుర్గాప్రసాద్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి వైఎస్సార్‌టీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్ మాతృమూర్తి సైదమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సాఆర్ నాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి, పి.సైదులు, సూరేపల్లి శ్రీను, ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు మరికంటి రేణుబాబు, పెద్దపాక వెంకటేశ్వర్లు, మరికంటి రమేష్ తదితరులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పాండురంగాపురం మజీద్‌లో వైఎస్సార్‌టీపీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులకు ఖర్జూరాలు, పండ్లు తినిపించి ఈ రోజు దీక్షను విరమింపజేశారు. అనంతరం వారితో పాటు కృష్ణమోహన్ నమాజును ఆచరించి, దువా చేశారు.

కార్మిక హక్కుల రక్షణ కోసం పోరాటం

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెట్టడాన్ని దేశ కార్మిక వర్గం తిప్పికొట్టాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవినీతి పెట్టుబడుల ఖజానాను నింపుతుందే తప్ప సామాన్య ప్రజలను పట్టించుకోవటం లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఆవుల అశోక్, రాందాస్, శరత్, పుల్లయ్య, వెంకన్న, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: శ్రీ అఖిలాండకోటి అఖండ జ్యోతి ప్రజ్వలన వ్రతము ఈనెల 27 నుంచి జూన్15 వరకు ఖమ్మం నగరంలోని టేకులపల్లిలోని రామ సీతమ్మ హరిప్రసాదరావు దంపతుల కళానిలయంలో నిర్వహించబడుతున్నట్లు సాయి పాదరేణువుల పూజ్య శ్రీరామ్‌జీ గురువు తెలిపారు. ఆదివారం టేకులపల్లిలో వ్రతములకు సంబందించిన వివరాలను విలేకరుల సమావేశంలో గురూజీ వెల్లడించారు. అనంతరం వ్రతానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, బొమ్మ కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, లెక్చరర్ కమర్తపు గోపాలరావు, జెల్లెపల్లి రమేష్, కొతవరపు గంగావరప్రసాద్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మంద గురుస్వామి కుటుంబానికి ఆదివారం రూ.5 వేల నగదును ఇఫ్టూ ఆధ్వర్యాన అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపాక వెంకన్న, చట్టు శ్రీను, పగిడికత్తుల సాలయ్య, వెంకట్, నవిలే శ్రీనివాస్‌లు, రాజశేఖర్, యాకోబ్ మియా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	రుద్రుడు
ఆదిత్య	శాకుంతలమ్
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంవ్యవసాయం

జీఓ 58తో పేదలకు శాశ్వత భద్రత

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీలో మంత్రి పువ్వాడ



రంజాన్ తోఫా అందజేస్తున్న మంత్రి



ఇంటి పట్టా అందిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నిలువ నీడలేక గుడిసెలు వేసుకున్న పేదలకు శాశ్వత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ జీఓ 58 కింద ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు జారీ చేసిన జీఓ 58, 59 ద్వారా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6, 55, 56వ డివిజన్లకు చెందిన పేదలు దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైన 175 పట్టాలను ఆదివారం సాయంత్రం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల నాటి పేదల కలలను జీఓ 58, 59లతో సాకారం కావడంతో పాటు వారిలో ధైర్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటి, మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, పగడాల నాగరాజు, రెవెన్యూ డివిజన్ అధికారి రవీంద్రనాథ్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శైలజ ఉన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ..

రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందిస్తున్న రంజాన్ తోఫాలను మంత్రి అజయ్‌కుమార్ ఆదివారం పంపిణీ చేశారు. నగరంలోని 42వ డివిజన్ నిజాంపేట, 40వ డివిజన్ శుక్రవారపేట, 39వ డివిజన్ మెదరి బజార్, 38వ డివిజన్ ఖిల్లా, 37వ డివిజన్ కస్బా బజార్ మజీద్‌లలో ఆయా తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడు అందించే ఐదు వేల గిఫ్టు ప్యాక్‌లతో పాటు మరో 1,700 గిఫ్ట్ ప్యాక్‌లను చేర్చి పంపిణీ చేస్తున్నామని, వీటితో పాటు పువ్వాడ ఫౌండేషన్ తరఫున 6,700 సేమియా, చక్కెర, డ్రై ఫ్రూట్స్ కిట్లను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, ఏఎంసీ చైర్ పర్సన్ దోరెపల్లి శ్వేత, కార్పొరేటర్లు పాకాలపాటి విజయనిర్మల, మడూరి ప్రసాద్, దాదే అమృతమ్మ, ఆలియా షౌకత్ అలీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, మైనారిటీ నాయకులు తాజుద్దీన్, ఖమర్, ముక్తార్, సలీం, ముజాహిద్, తౌసిఫ్, షంషుద్దిన్, మదురి సైదారావు, మెహబూబ్ అలీ, శేషగిరిరావు, దాదే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు పరామర్శ..

ఖమ్మం వైద్యవిభాగం: చీమలపాడు ఘటనలో గాయాలపాలై సంకల్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ నవీన్‌ను ఆదివారం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎలాంటి వైద్య సేవలైనా తక్షణమే అందించాలని, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్సలను అందించాలని వైద్యులకు సూచించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు రక్తదానం..

ఖమ్మంక్రైం: హెడ్ కానిస్టేబుల్ నవీన్‌కు అత్యవసరంగా రక్తం అవసరం కావటంతో ట్రాఫిక్ హోంగార్డ్ దామెర రవి స్పందించి ఆయనకు డాక్టర్స్ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం అందించారు.

నేడు ఖమ్మంలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు 23వ డివిజన్‌లో శాంతినగర్‌లోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరం, 9.50 గంటలకు 10వ డివిజన్ చైతన్యనగర్‌లో సీసీ రోడ్డు, డ్రెయిన్లను ప్రారంభించనున్నారు. 10.10 గంటలకు టేకులపల్లి కేసీఆర్ టవర్స్ వద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పొజిషన్ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ఖమ్మం వైద్యవిభాగం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఆదివారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత పదిహేనేళ్లుగా ఆరోగ్యశ్రీ పథకంలో ప్రభుత్వం గుర్తింపు ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల సంరక్షణ పథకం, జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ పథకం, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగస్వాములై తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అందుతున్న రూ.13,000 జీతంతో కుటుంబ పోషణ భారం అవుతున్నందున తమకు కనీస జీతం రూ. 28,000 చెల్లించేలా చూడాలని, పెండింగ్ సమస్యలు తీర్చాలని వినతిపత్రంలో కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పెరిక సంఘం..

ఖమ్మం మామిళ్లగూడెం: నూతనంగా ఎన్నికైన పెరిక సంఘం నాయకులు ఆదివారం మంత్రి అజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన పెరిక సంఘం సభ్యులను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు బందుసూర్యం, జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లింగేశ్వరావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు ఈశ్వర్, గురువయ్య, నగర అధ్యక్షుడు వెంకన్న, మహేందర్, రత్నాకర్, అప్పారావు, శ్రీనివాసరావు, రాజు, వెంకటేశ్వర్లు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో వార్ వన్ సైడే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: పాలేరు బీఆర్ఎస్ టికెట్ మనకే వస్తుంది.. వార్ వన్‌సైడే అయి మనమే గెలుస్తామని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి చెప్పారు. ఆదివారం మండలంలోని బారుగూడెంలోని మహ్మదీయ కళాశాల ఆవరణలో జరిగిన ఖమ్మం రూరల్ మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ ఎవరో ఒకరు వస్తారు.. ఏదో చెప్తారు.. ఇక్కడ శాశ్వతంగా ఉండి ప్రజలకు పని చేసేది ఎవరనేది తెలుసుకోవాలని, పాలేరు ప్రజల కోసం నా ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని పేర్కొంటూ తాను చేసిన అభివృద్ధి పనులపై వివరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. తెలంగాణలో నవంబర్ మాసంలో ఎన్నికలు జరగనున్నందున పార్టీ బాధ్యతలన్నీ నాయకుల మీదే వేయకుండా కార్యకర్తలు కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ పని చేయాలని పేర్కొన్నారు. కరోనా సమయంలో ఏ పార్టీ జెండా కూడా పాలేరులో కనిపించలేదని, ఇప్పుడు ఒకాయన వచ్చి బీఆర్ఎస్ నుంచి ఎవరినీ కూడా అసెంబ్లీ గేటు దాటనీయనని అంటున్నారని, డబ్బు అహంకారాన్ని ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పదికి పది సీట్లు గెలిచి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, జెడ్పీటీసీలు ఎ.వరప్రసాద్, ఇంటూరి బేబీశేఖర్, ఆత్మకమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీపీలు బెల్లం ఉమ, బి.శ్రీను, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ఎం.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

కూసుమంచి: పాలేరులో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. తర్వాత అధికారులు, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, రైతుబంధు కన్వీనర్ బాణోత్ రాంకుమార్, ఆత్మా డైరెక్టర్ ఉపేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కూసుమంచి: రానున్న ఎన్నికల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండలంలోని గురువాయిగూడెం గ్రామంలో స్వశక్తి కరణలో భాగంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ మంద చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరబాబు, లింగారెడ్డి కిరణ్, రమణారెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో పాదల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు ముడి పెడుతూ బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న అన్నారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ ఎదుగుదలను ఆపలేరన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, నాయకులు పరికపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి విస్తృత పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం జిల్లాలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చీమలపాడు ఘటనలో గాయాలుపాలై సంకల్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ నవీన్‌ను పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పలు శుభకార్యాలయాల్లో పాల్గొన్నారు. అలాగే కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలోని తిరుపతమ్మ దేవస్థానంలో జరిగిన బత్తుల వెంకట్రావు మొక్కు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పొంగులేటిని సత్కరించారు.



ముస్తఫాను పరామర్శిస్తున్న పొంగులేటి

అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న ఎండీ ముస్తఫాను ఆదివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు పీర్‌గైబ్ షావలీ బాబా ఉర్సు మహోత్సవం



ముస్తాబైన పీర్‌గైబ్ షావలీ బాబా దర్గా

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని శుక్రవారపేటలో గల హజరత్ పీర్‌గైబ్ షావలీ బాబా ఉర్సు మహోత్సవ వేడుకలకు దర్గాను ముస్తాబు చేశారు. గత 31 ఏళ్లుగా హిందు, ముస్లిం భక్తుల మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ మాసం 25వ రోజున ఈ ఉర్సు వేడుకలు నిర్వహిస్తారు. తరవీహ్ నమాజ్ అనంతరం తుమ్మలగడ్డలోని దర్గా సేవకులు తాజ్ బాబా ఇంటి వద్ద నుంచి ప్రత్యేక ప్రార్థనలతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పంఖా, ఖోడా ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఊరేగింపు తుమ్మలగడ్డ మసీదు, శుక్రవారపేట, రిక్కా బజార్, శివాలయం మీదుగా పీర్ గైబ్ షావలీ దర్గాకు తెల్లవారుజామున చేరుకోనుంది.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(జీసీజీటీఏ) జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అసోసియేషన్ జిల్లా పూర్వ కార్యదర్శి డాక్టర్ సీవీ మురళీధర్ తెలిపారు. ఆదివారం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఎన్నికల్లో జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్.మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పి.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి, కోశాధికారిగా పి.కృపవేణి, ఈసీ మెంబర్లుగా డాక్టర్ బి.వెంకన్న ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జాండిస్, కిరణ్‌కుమార్‌లు వ్యవహరించారన్నారు. నాయకులు ఎన్.గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని సూర్యాతండా అభివృద్ధికి నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సూర్యాతండాలో విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చేయాలని ఫౌండేషన్ నిర్వాహకులు 2021 సంవత్సరంలో గ్రామాన్ని దత్తత తీసుకొని విద్యను ప్రోత్సహించడం, పుస్తకాలు, ప్రతిభ చూపిన వారికి బహుమతులు ఇవ్వడం చేస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సలహాదారులు సత్యనారాయణ, రమేష్, శివాలాల్, పవన్, సుధాకర్, అబ్దుల్ కలాం యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ జాబితాలో పేర్లు గల్లంతు



మంగాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతుండగా ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు గల్లంతయ్యాయని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత ఉన్న సభ్యులను తొలిగించారంటూ గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. వివరాలు.. మండలంలోని చెరువు మాధారం చెరువు మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు మూడేళ్లుగా యత్నిస్తుండగా ఇటీవల అడుగు వేశారు. ఈమేరకు మంగాపురం, రాజారాంపేట, చెరువుమాధారం, రాయగూడెం గ్రామాలకు చెందిన 895 మంది సభ్యులతో జాబితా విడుదల చేయగా... మంగాపురంతండాకు చెందిన 21 మంది సీనియర్ సభ్యుల పేర్లతో పాటు మరికొందరి పేర్లు గల్లంతయ్యాయని చెబుతున్నారు. 1991 నుంచి ఓటు హక్కు ఉన్న వారి పేర్లు తొలగించారంటూ ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలపడమే కాక కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని భూక్యా నాగేశ్వరరావు తదితరులు పేర్కొన్నారు. అలాగే, చెరువు కింద గిరిజనుల భూములు ముంపునకు గురవుతున్నా అధికారులు అన్యాయం చేయడం సరికాదని మంగాపురం సర్పంచ్ భూక్యా సుధాకర్ అన్నారు. ఇదే విషయమై జిల్లా మత్స్య శాఖాధికారి డి.ఆంజనేయ స్వామిని వివరణ కోరగా.. తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం ఉన్న జాబితా ప్రదర్శించామని, ఇంకా అర్హులు ఉంటే ఆధారాలతో సహా వారంలోగా సంప్రదించాలని సూచించారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం



సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మంరూరల్: బంజారాలు ఐక్యంగా ఉండి సమస్యలు సాధించుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని పెదతండాలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రాంమూర్తినాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాలు అన్ని రంగాల్లో రాణించడానికి సంఘం ఎల్లవేళలా కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం రాంచంద్రునాయక్, రాంమూర్తినాయక్‌లను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమ్లానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివాజీనాయక్, కార్యదర్శి బిక్కినాయక్, నాయకులు అనిల్‌నాయక్, బి.అరుణ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'షైన్ ఇండియా' వార్షికోత్సవ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: షైన్ ఇండియా స్కూల్ నాల్గో వార్షికోత్సవ వేడుకలు నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలను మేయర్ పునుకొల్లు నీరజ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం స్కూల్ చైర్మన్ తాళ్ళూరి సృజన్‌కుమార్, కరస్పాండెంట్ తాళ్ళూరి ఉషారాణిలు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పరిపక్వత, అభ్యాసం, సామాజిక నైతిక విలువలు అనే అంశాలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు రామచంద్రరావు, స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం, రిటైర్డు హెచ్ఎం తాళ్ళూరి వేణు, పీఆర్‌టీయూ నాయకుడు శేఖర్ పాల్గొన్నారు.

నిశ్శబ్ద ఆరాధనే ఉపవాసం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపవాసం కేవలం అన్నపానీయాలు వదిలేయటం కాదని.. చెడులను మానేసి, మంచి పనులను అవలంబించుకోవడమే అని జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి సాధిక్ అహ్మద్ అన్నారు. ఖమ్మం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితంలో క్రమశిక్షణ అలవర్చుకోవటానికి రంజాన్ ఉపవాసాలు ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో అర్బన్ జిల్లా అధ్యక్షుడు అబ్రార్, ఖిల్లా అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, సుబూర్, జమీల్ అహ్మద్‌ఖాన్, మూసా, రఫీ, షరీఫ్, లతీఫ్, అబ్దుల్ మల్లిక్, నిజాముద్దిన్, సమీ, యూసఫ్ షరీఫ్, రజాక్, గౌస్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేలకొండపల్లి: చెరువుమాధారంలో ఆదివారం సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాజారాంపేట సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు దీరవత్ బాలాజీ, డైరెక్టర్లు చిర్రా జయరాజు, కాటం వెంకటరెడ్డి, దిలావార్ ఖాన్, పి.అనిల్‌గౌడ్, తేజావత్ కోటేశ్వరరావు, యాదాద్రి, సొసైటీ కార్యదర్శి నాగేశ్వరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఖమ్మం సహకారనగర్: దేశంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యావకాశాలు కల్పించాలని అందుకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ) భిన్నంగా ఉందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఈపీలో అనేక లోపాలున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ బాధ్యత విస్మరించి చారిటబుల్ సంస్థకు అప్పజెప్పాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఆజాద్, నాయకులు వెంకటేష్, మస్తాన్, పీవైఎల్ నాయకులు రాకేష్, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు బాబురావు, రమాదేవి, పద్మ, సంధ్యారాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో విద్యుత్ మోటారు వద్ద ఆదివారం మంటలు చెలరేగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ బావి వద్ద ఉన్న విద్యుత్ మోటార్ సమీపంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. మంటలు వ్యాపించిన సమయంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిందని, పక్కనే ఉన్న విద్యుత్ డీపీని అంటుకుని ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పొలాల్లో వ్యాపించిన మంటలు..

కూసుమంచి: మండలంలోని బూరేడుగుట్ట తండా సమీపంలో ఓ రైతు చేలోని చెరకు ఆకుకు నిప్పు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో సమీపంలోని తండావాసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

సింగారెడ్డిపాలెంలో ఇంటింటికీ టీడీపీ

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెంలో టీడీపీ ఇంటింటికీ కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ మండల కో–ఆర్డినేటర్ ఆరెకట్ల కొండలరావు ప్రారంభించారు. అనంతరం పార్టీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు ప్రజల ఎజెండాను వదిలేసి సొంత ఎజెండాలను ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సూరపనేని రామకృష్ణ, పార్టీ నాయకులు పావులూరి వెంకటేశ్వరరావు, నల్లమాసు మల్లయ్య, నూక హనుమంతరావు, షేక్ నాగుల్ మీరా, కుక్కల ఆనందరావు, మద్దినేని మహేష్, గోగినేని వెంకటసీతారామారావు, అక్కినేని నాగేశ్వరరావు, నూతక్కి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లారీ సంఘం ఎన్నికలు



అధ్యక్షుడు డి.భద్రం



కార్యదర్శి బి. శ్రీనివాస్‌రావు

ఖమ్మంగాంధీచౌక్: అట్టహాసంగా జరిగిన ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో బోయపాటి వాసు ప్యానెల్ జయకేతనం ఎగురవేసింది. మూడేళ్ల కాలపరిమితి కలిగిన ఈ సంఘం ఎన్నికల పోలింగ్ ఆదివారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు లారీ యజమానుల సంఘం కార్యాలయంలో జరిగాయి. మొత్తం 486 మంది సభ్యులు ఓటర్లు ఉండగా 483 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 3 గంటల వరకు పోలింగ్ జరగగా, సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలను వెల్లడించారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా కొత్త వెంకటేశ్వరరావు వ్యవహరించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన డి.భద్రంకు 433 ఓట్లు రాగా, ప్రత్యర్థి సముద్రాల శ్రీనివాస్‌రావుకు 47 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన బోయపాటి శ్రీనివాస్‌రావు(వాసు)కు 429 ఓట్లు రాగా ప్రత్యర్థి బోజెడ్ల పూర్ణచందర్‌రావుకు 52 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్ష పదవికి రఘురాం ప్రసాద్‌కు 436 ఓట్లు వస్తే.. ప్రత్యర్థి సూధగాని ఉపేందర్‌కు 44 ఓట్లు వచ్చాయి. కోశాధికారి పదవికి ఆవుల ఉమామహేశ్వరరావుకు 421 ఓట్లతో విజయం సాధించగా, ప్రత్యర్థి నరాల అశోక్‌కుమార్ 58 ఓట్లు సాధించారు. సహాయ కార్యదర్శిగా ఎస్‌కె రంజాన్ ఏకగ్రీవమయ్యాడు. 10 కార్యవర్గ సభ్యుల పదవులకు 13 మంది పోటీలో నిలవగా ఎం.వెంకటేశ్, ఎం.ఏసు, పి.తరుపతయ్య, కె.శ్యామ్, ఐలా నాగరాజు, ఎస్‌కె.మహ్మద్, బెక్కం కనకయ్య, ఎస్‌కె.మస్తాన్‌వలీ, బత్తుల నాగేశ్వరరావు, సయ్యద్ అహ్మద్ పాషాలు విజయం సాధించారు. విజయం సాధించిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి ఎన్నిక పత్రాలను అందించారు.